క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం, కొళిగాం సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ పనులు మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈదుపురం, కేశపురం, సన్యాసిపుట్టుగ, బూర్జపాడు, డొంకూరు, కొళిగాం, బిర్లంగి, తేలుకుంచి, హరిపురం, బొడ్డఖాళీ, బొడ్డబడ, కీర్తిపురం, పాయితారి ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించాలని కోరారు.

నందిగాం: దేవుపురం ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నందున శుక్రవారం తురకులకోట, జడ్యాడ, బడగాం, దేవుపురం, భోరుబద్ర, కాపుతెంబూరు, లవునిపల్లి, వజ్జీలపేట, సింగుపురం తదితర గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ జి.శంకరరావు తెలిపారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ పరిశీలన



ఓవర్ హెడ్ ట్యాంక్ క్లీనింగ్ తేదీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కంచిలి : మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ వి.నీరజ గురువారం తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం పద్రిపుట్టుగలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించి ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేసిన తేదీని తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు.

చిన్నారులకు బ్యాగుల వితరణ



చిన్నారులకు బ్యాగులు అందిస్తున్న దాతలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన బాలసదనంలో చిన్నారులకు శుక్రవారం పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన రఘునాథ్ ప్రసాద్ పాడి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రుద్రపాడి బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో పవన్‌పుత్ర సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

కాపు హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా రామారావు



కొత్ర రామారావు

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం కాపు పరిరక్షణ సమితి అధ్యక్షునిగా మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన కొత్ర రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి ఫణికుమార్ నుంచి ఉత్తర్వులు అందాయని రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆవుదూడలపై కుక్కల దాడి



గాయపడిన ఆవుదూడ

కాశీబుగ్గ: పలాస మండలం మామిడిపల్లిలో గురువారం కుక్కలు స్వైర విహారం చేసి మూగజీవాలపై దాడి చేశాయి. మామిడిపల్లి కాలనీలో వంకల అప్పయ్య, రాపాక పాపారావు, జడ్డే జోగారావులకు చెందిన ఆవుదూడలను, సారతవిటయ్యకు చెందిన మేక, మేక పిల్లలను గాయపరిచాయి. అధికారులు స్పందించి కుక్కలను నియంత్రించాలని గొర్రెల, మేకల కాపరులు, పాడి రైతులు కోరుతున్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



గణపతిరావును సన్మానిస్తున్న దృశ్యం


పలాస: విశాఖపట్నం ఎయిర్ పోర్టులో సీఐఎస్‌ఎఫ్ ఏఎస్‌ఐగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సువర్ణపురం గ్రామానికి చెందిన నర్తు గణపతిరావును గురువారం గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. గ్రామాభివృద్ధిలో ఎంతగానో కృషి చేశారని ప్రశంసించారు.

15న మందసలో నేత్రవైద్య శిబిరం

కాశీబుగ్గ : మందస పట్టణంలో ఈ నెల 15న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణుల నేతృత్వంలో సత్యసాయి మందిరంలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9494588963 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తల్లికి వందనం..

అంతా గందరగోళం



స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామన్న కూటమి మేనిఫెస్టో ఇదే..

కూటమి ప్రభుత్వం హామీలో ఒకటైన తల్లికి వందనం పథకం ఇప్పటి వరకు అమలు కాకపోవడంతో తల్లులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం విడుదల చేసిన జీఓతో అందరిలో గందరగోళం నెలకొంది. ఎంతమంది పిల్లలను పంపిస్తే అంతమందికి కూడా ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందజేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం, పిల్లల సంఖ్య, ఇతర అంశాలపై స్పష్టత ఇవ్వకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

– కాశీబుగ్గ/పలాస/వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్

అందరికీ ఇవ్వాలి



మా పాప నిహారిక ప్రైవేటు స్కూలులో నాలుగో తరగతి చదువుతోంది. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి. అందరికీ తల్లికి వందనం అమలు చేయాలి.

– బల్ల రేవతి శ్రీనివాస్, విద్యార్థిని తల్లి, 15వ వార్డు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

వెంటనే ఇవ్వాలి



మా పాప, బాబు చదువుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు దాటాయి. పుస్తకాలు, ఫీజులు, ఇతర ఖర్చులకు తల్లికి వందనం డబ్బులు విడుదల చేయాలి. కూటమి ప్రభుత్వం హామీ నెరవేర్చాలి.

– బదకల బాలమ్మ, విద్యార్థుల తల్లి, పద్మనాభపురం, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

ఎదురుచూపులు..



మాది పేద కుటుంబం. ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. పాఠశాలలు ప్రారంభమై నెలరోజులు కావస్తున్నా తల్లికి వందనం డబ్బులు ఇంకా అందలేదు. ప్రభుత్వం ఎప్పుడు పథకం అమలు చేస్తుందో స్పష్టత ఇవ్వాలి.

– బత్తిన ఝాన్సీ, మాకన్నపల్లి, పలాస మండలం

మాట నెరవేర్చాలి..



చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలో తల్లికి వందనం పేరుతో ఎంత మంది ఉంటే అంతమంది చదువుకున్న చిన్నారులకు రూ.15వేలు ఇస్తామన్నారు. మా ఇద్దరు పిల్లలూ పాఠశాలలో చదువుతున్నారు. జగన్‌లా చంద్రబాబు కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి.

– పుచ్చ మీనా, గృహిణి, పూండి బస్టాండ్, వజ్రపుకొత్తూరు మండలం

స్పష్టత ఇవ్వాలి



మాకు ఇద్దరు కుమార్తె జ్ఞానాంబిక, వినీష్యలు స్కూల్లో చదువుతున్నారు. పిల్లల సంఖ్య విషయమై స్పష్టత ఇవ్వాలి. తల్లికి వందనం పథకం కింద రూ.30 వేలు విడుదల చేసి సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలి.

– కె. పూజిత,, పీఎంపురం, వజ్రపుకొత్తూరు మండలం

ఇద్దరికీ ఇవ్వాలి



నాకు ఇద్దరు పిల్లలు. కుమార్తె యశశ్రీ ఇంటర్ ఫస్టియర్, కుమారుడు సందీప్ 9వ తరగతి చదువుతున్నాడు. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ లెక్కన రూ. 30 వేలు అందజేయాలి.

– టి.జ్యోతి, విద్యార్థుల తల్లి, సీతాపురం, వజ్రపుకొత్తూరు మండలం

శివారు ప్రాంతాలకూ సాగునీరు



పొల్లాడ చెరువు వద్ద హారతులిస్తున్న పలాస ఎమ్మెల్యే శిరీష

వజ్రపుకొత్తూరు: శివారు ప్రాంత భూములకూ వంశధార జలాలు తీసుకొచ్చి హామీ నిలబెట్టుకున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడలో వంశధార 60 ఆర్‌ఎల్ కాలువ ద్వారా పెద్ద చెరువుకు నీరు చేరడంతో గురువారం వంశధార జలాలకు హారతులు పట్టారు. మాజీ సర్పంచ్ అట్టాడ రఘుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టాడ రాజేశ్వరరి, మాజీ ఎంపీపీలు ఎం.సూర్యనారాయణ, జి.వసంతరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మోహనరావు, మాజీ అధ్యక్షులు బి.శశిభూషన్, గోవింద పాపారావు, గోవిందపురం పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పి.ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, టి.అప్పోజీ, కె.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా అరికట్టాలి



నిరసన తెలియజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కాశీబుగ్గ: ఒడిశా సరిహద్దు సమీపంలో ఉన్న పలాసకు రోడ్డు, రైలు సౌకర్యం ఉండటంతో గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగుతుందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం కాశీబుగ్గలో ఏఐవైఎఫ్ శ్రీకాకుళం జిల్లా సమితి ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోరు వాసు, కొన్న శ్రీనివాసరావులు మాట్లాడుతూ పలాస కేంద్రంగా జరుగుతున్న గంజాయి అక్రమ వ్యాపారాన్ని అరికట్టడంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీస్ యంత్రాంగం విఫలమైందన్నారు. పాఠశాలలు, కాలేజీల కేంద్రంగా విద్యార్థులు, యువతకు తినుబండారాల రూపంలో మత్తుమందును కలిపి బానిసలుగా చేస్తున్నారని, తక్షణమే వీటికి అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఫ్ నాయకులు గుణశేఖర్, దిలీప్, వెంకటరావు, వల్లభరావ్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం



ఎమ్మెల్సీ రామారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

కవిటి: మండలంలోని పెద్ద ఎర్రగోవిందపుట్టుగ గ్రామదేవత చింతామణి అమ్మవారు, కాళికాదేవి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, పినింటి జయరావు, టీడీపీ నేతలు బాసుదేవ ప్రధాన్, ఎర్ర దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

కోటబొమ్మాళి: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలంటూ గురువారం కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోటబొమ్మాళిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఏపీపీ డి.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

జయహో జగన్నాథ..



కాశీబుగ్గ: పూజలు చేస్తున్న జగన్నాథ బ్రాహ్మణ సంఘ సభ్యులు



సోంపేట: నృసింహావతారంలో జగన్నాథుడు



టెక్కలి: నరసింహస్వామిగా జగన్నాథుడు



కంచిలి: గుండిచా మందిరంలో జగన్నాథుడు



ఉగ్రనరసింహస్వామి అవతారంలో స్వామివారు

కాశీబుగ్గ:

పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో జరుగుతున్న జగన్నాథ రథయాత్రలో భాగంగా గురువారం హిరాపంచమి ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులతో పాటు జై జగన్నాథ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

టెక్కలి: జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం టెక్కలిలో జగన్నాథుడు నరసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోంపేట: జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సోంపేటలో జగన్నాథ స్వామి గురువారం నృసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కంచిలి: హీరా పంచమి సందర్భంగా గుండిచా మందిరంలో జగన్నాథునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

ఇచ్ఛాపురం: జగన్నాథుని రథయాత్రలో భాగంగా స్వామివారు నరసింహునిగా భక్తులకు దర్శనమిచ్చారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఇచ్ఛాపురం: ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమణమ్మ, సిబ్బంది



జువ్వాది జాహ్నవి, చెక్క సంధ్య, అప్పిని కీర్తన, ఏ.షణ్ముఖప్రియ, మురిపింటి హరితాశ్రీ, విలియం కేరీ, పల్లవి, ఎస్.విశాల్, ఇప్పిలి మేఘన, బార్నాన జ్యోత్స్న, సూర మోహిత్, గుమ్మడి సోనియా, గీతాంజలి పాణిగ్రహి, బెహరా దొళై విజయ్, కుశిరెడ్డి హర్షిత

సంతబొమ్మాళి: మండలంలోని దండుగోపాలపురం ఉన్నత పాఠశాలకు చెందిన అప్పిని కీర్తన, అలజంగి షణ్ముఖప్రియ. కింజరాపు సాత్విక, వాద్రేవు భూమిక, బోరుభద్ర ఉన్నత పాఠశాలకు చెందిన జువ్వాది జాహ్నవి, చెక్క సంధ్య, పందిరి ఓంకార్, పాలిని హారికలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. వీరికి హెచ్‌ఎంలు కోత చైతన్య, పి.రామకృష్ణ, ఉపాధ్యాయులు గురువారం అభినందనలు తెలిపారు. సంతబొమ్మాళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సాధు దేవి, తంగి జగదీష్, ఎండ తేజ, సాధు మానస, పందిరి ఉమా, బల్ల హర్షిత, గుంట ముక్కల సూర్య, గున్న కీర్తిలు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారు.

కంచిలి: మఠం సరియాపల్లి ఏ.పి మోడల్ స్కూల్‌కు చెందిన కాయ సంధ్య, బల్లెడ జ్యోత్స్న, పిల్లి దీపక్, కర్తలి ప్రీతి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. జలంత్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి మురళీ గౌడో, బలరాం పాత్రో, స్నేహలత పాఢి ఎంపికైనట్లు హెచ్‌ఎం భాస్కర్ మిశ్రా చెప్పారు. డోలగోవిందపురం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి కె.కృష్ణవేణి, జి.నిర్మల, కె.స్నేహ, స్నేహ నేపాక్, రాజశ్రీ నాయక్, మఠం సరియాపల్లి న్నత పాఠశాల నుంచి అంజలి బెహరా, కంచిలి అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి పి.లికిత్ సాయిప్రసాద్, టి.నిరంజన్, ముండల జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి శ్రీనుపాత్రోలు ఎంపికైనట్లు ఎంఈఓ-1 ఎస్.శివరాంప్రసాద్ తెలిపారు.

పలాస: మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన మురిపింటి హరితాశ్రీ, జడ్డే హిమబిందులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

టెక్కలి: చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విలియం కేరీ, టెక్కలి బాలికోన్నత పాఠశాలకు చెందిన పల్లవి, తనుష్క, సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.విశాల్, ఇ.మధు, డి.బాల భాస్కర్ , టెక్కలి ఎంజేపీ ఏపీ పాఠశాలకు చెందిన బంటుపల్లి రేవతి, గొండు దివ్య, మక్కా మాధురి, సిస్టు సునీత, చింతు పూజిత, బార్నాన హర్షిత, తమ్మినాన మాధవి, పల్లి నిహారిక, దల్లి కిన్నెర, కింజరాపు ప్రవల్లిక, సవలపురపు వరలక్ష్మి, సతివాడ మానస, టంకాల సమీర తదితర 15 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీల్లో సీట్లు సాధించారు.

కవిటి: మండలంలోని సహలాలపుట్టుగ ఒరియా ఉన్నత పాఠశాల విద్యార్థిని ఇరా రేష్మ, బొరివంక ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం సనపల రామకృష్ణతెలిపారు.

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలకు చెందిన బి.హాసిని,బి.హిమావతి, సహస్ర బెహరా, డి.హేమంత్ కుమార్, కె.మహేష్ , కె.రియా, ఎం.అమృత, పి.గౌరి, రి.ఇందు ప్రియ, సి.ద్వివశ్రీ, టి.కుసుమ, టి.లలిత్ కుమార్ ట్రిపుల్ ఐటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చిన్నాజీ వర్మ తెలిపారు.

నందిగాం: మండలంలోని తురకులకోటకు చెందిన సూర మోహిత్, పెద్దతామరాపల్లికి చెందిన ఇప్పిలి మేఘన, పెద్దతామరాపల్లికు చెందిన బార్నాన జ్యోత్స్న, కవిటి అగ్రహారానికి చెందిన గుమ్మడి సోనియా, రౌణగల ధరణి, దూపాన వాణిలు ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు.

కాశీబుగ్గ: పలాస మండలం రెంటికోట ల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గీతాంజలి పాణిగ్రాహి, బెహర దొళై విజయ్, కుసిరెడ్డి హర్షిత, కృష్ణప్రియ మంత్రో ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం .నిర్మల తెలిపారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కంచర్ల మహిజ, డబ్బూరు వైష్ణవి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం పి.వి.రమణమ్మ తెలిపారు. వీరిని పాఠశాల ఆవరణలో గురువారం సత్కరించారు.

ప్రజావేదిక గౌరవం నిలబెట్టాలి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: ప్రభుత్వం పేదల్ని ఆర్థికంగా ఆదుకోవడం ఆస్తులను అభివృద్ధి చేయడానికి ప్రవేశపెట్టిన ఉపాధి హామీ బహిరంగ ప్రజావేదిక గౌరవాన్ని నిలపాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. గురువారం కవిటి ఉపాధి భవనం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికకు డీఆర్‌డీఏ పీడీ జి.వి.చిట్టిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో 3678 పనులకు గానూ రూ.13.85 కోట్ల నిధులు వినియోగించి అభివృద్ధి పనులు నిర్వహించారు. వీటిలో వేజ్ కాంపొనెంట్‌గా రూ.10,38,10,600 వెచ్చించగా రూ.3,53,06,379 మెటీరియల్ కాంపోనెంట్ విభాగంలో కేటాయింపులు జరిపారు. వీటికి సంబంధించిన పనుల్లో అన్ని గ్రామ పంచాయతీలకు కలిపి రూ.1,02,000 తేడాలకు సంబంధించి ఏపీఓ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్, టీఏలు బాధ్యులుగా చేస్తూ రూ.26,000 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో ఎంపీపీ కడియాల పద్మ, పి.లక్ష్మణరావు, టీడీపీ నేతలు బి.రమేష్, పి.కృష్ణారావు, మణిచంద్రప్రకాష్, రంగారౌళో, సంతోష్ పట్నాయక్, విజిలెన్స్ ఆఫీసర్ బి.లవరాజు, ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఏపీడీ మురళి, ఏపీఓ టి.మోహనరావు, ఈఓపీఆర్‌డీ శివాజీ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం ఇస్తున్న పీఈటీలు

కవిటి: మండల, జిల్లాపరిషత్ తదితర విభాగాల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష పీఈటీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు సిబ్బంది గురువారం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యే బి.అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.మంత్రి లోకేష్ దృష్టికి సమస్య తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

బూర్జపాడులో పారిశుద్ధ్య పనులు

ఇచ్ఛాపురం రూరల్: పంచాయతీలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తున్నామని వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి అన్నారు. గురువారం బూర్జపాడు పంచాయతీలో పారిశుద్ధ్యం పనులు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పరిసరాలతో పాటు వ్యక్తి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బుడ్డ కళ్యాణ్ పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

ఇచ్ఛాపురం: మండల విద్యాశాఖాధికారి కె.అప్పారావు గురువారం ఇచ్ఛాపురం కేజీబీవీని సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.